
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

ఆదివారం 1 జూన్ 2025 | 5



పెన్షన్..నో టెన్షన్ : ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడి అక్కడే పింఛను అందజేస్తున్న సీఎం చంద్రబాబు



మీ సేవకు హ్యాట్సాప్ : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న మంతెన రామరాజును సన్మానిస్తున్న సీఎం



మీ మనసు బంగారం : బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్న త్సవటపల్లి నాగేంద్రరావుకు సన్మానం



మీ వెంటే నడుస్తాం : చెయ్యేరులో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ సానా సతీష్, మహాసేన రాజేష్ తదితర టీడీపీ నాయకులు



మా బాబే.. మాతో నడుస్తున్నాడ్ : చెయ్యేరులో ఉపాధి హామీ మహిళా శ్రామికులతో కలిసి చెరువును పరిశీలించి వస్తున్న సీఎం చంద్రబాబు

చెయ్యేరు.. జనం మురిసేరు!



ఏంటమ్మా.. సమస్య



చెరువు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రబాబుకు నీరాజనం

- 2 గ్రామాల్లో 6 గంటల పర్యటన
- సమస్యలు విని.. పరిష్కారం
- జూన్ 12 తర్వాత గేర్ మారుస్తా
- ఆకట్టుకున్న చంద్రబాబు ప్రసంగం

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎంతో సమస్యలు చెప్పుకున్నారు..వెంటనే పరిష్కారం చూపారు.. హామీలు ఇచ్చారు..జనం మురిసేరు..మా బాబే అంటూ జేజేలు పలికారు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల పరిధిలోని రెండు గ్రామాల్లో శనివారం ఆరు గంటలపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ప్రజావేదిక నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల్లో చైతన్యం పురికొల్పారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులతో మరో సమావేశం నిర్వహించి కేడర్‌కు నేనున్నాను అనే భరోసాను కల్పించారు. నేనున్నంత వరకు టీడీపీకి ఓటమి ఉండదంటూ కేడర్ హర్షధ్వానాల మధ్య చంద్రబాబు ప్రకటించారు. సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్‌కు శనివారం 12 గంటలకు చేరుకున్న చంద్రబాబుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాట్రేనికోన మండలం చెయ్యేరులో చెరువు పూడికతీత పనుల్లో నిమగ్నమైన ఉపాధి శ్రామికులతో చెరువుగట్టున నడుస్తూ ముచ్చటించారు. ప్రజావేదిక సభలో చలోక్తులు, చురకలు, వార్నింగ్‌లు, హెచ్చరికలు చేస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఉర్రూతలూగించింది.ఈ నెల 12వ తేదీ నాటికి ఏడాది పాలన పూర్తి కావడంతో పాలనా పరంగా గేర్ మారుస్తానంటూ సంకేతాలు పంపారు. చెయ్యేరులోని ప్రజావేదిక సభకు చేరుకుని రెండు బంగారు కుటుంబాలను దాతలకు దత్తత ఇచ్చారు. అదే వేదికపై సుమారు గంటా 45 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. ప్రజావేదికలో నివేదికలను తప్పుడు తడకలుగా ఇవ్వడంతో అధికారులను మందలించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 10వేల ఇళ్లకు సోలార్ పవర్ కల్పించకపోతే 'ఎమ్మెల్యే పవర్ కట్' అవుతుందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు వెల్లివిరిశాయి. అవినీతి అధికారులకు ఘాటైన హెచ్చరికలు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తానన్నారు. ఇటీవల ఒక పాస్టర్ మరణాన్ని కొందరు స్వార్థపరులు హత్యగా విష ప్రచారం చేశారన్నారు. బంగారు కుటుంబాలకు భవిష్యత్తుకు భరోసా ఇస్తూ దాతలకు బాధ్యతలు అప్పగించారు. సాయంత్రం 5.45 గంటలకు సీహెచ్.గున్నేపల్లి నుంచి హెలికాప్టర్‌పై ఉండవల్లిలోని నివాస గృహానికి బయలుదేరి వెళ్లారు.

మీరు చెప్పినట్టే అధిష్ఠానం నడుస్తుంది..

నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు దిశానిర్దేశం

ముమ్మిడివరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కార్యకర్తలే ముఖ్యం. మీ అభిప్రాయాల మేరకే పార్టీ అధిష్ఠానం నడుచుకుంటుంది. అనునిత్యం ప్రజలతో మమేకమై ఓటుబ్యాంకు పెంచే దిశగా పనిచేయాలని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ముమ్మిడివరం మండలం సీహెచ్.గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జరిగిన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రోజు ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలు పెట్టాం. రాబోయే ఎన్నికల్లో గతంలో ఓడిన 11 అసెంబ్లీ స్థానాలు మనమే గెలవాలి. టెక్నాలజీని పెంచుకుని సేవలు విసరిస్తున్నాం. ప్రజలతో కార్యకర్తలు మమేకమై మరింత పేరు తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గం టీడీపీ కంచుకోట. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో మహిళల ప్రాధాన్యత పెంచాల్సి ఉందన్నారు. 25 మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ల నియామకానికి సంబంధించి సర్వే నిర్వహించగా కొంతమందికి 90 శాతం, కొంతమందికి 50 శాతం రిపోర్టు వచ్చిందన్నారు. ఎస్సీ ఓటు బ్యాంకు పెంచేందుకు పీ4 అమలు చేస్తున్నాం అంటూ చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పనితీరుపై చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా పోస్టింగుల్లో వెనుకబడి ఉన్నారంటూ చురక వేశారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముమ్మిడివరం నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుల పనితీరు విశ్లేషించారు. బెస్ట్ అవార్డులు తీసుకున్న క్లస్టర్ ఇన్‌చార్జి గొలకోటి దొరబాబు, యూనిట్ ఇన్‌చార్జి దూలిపూడి వెంకటసుబ్బారావు, బూత్ ఇన్‌చార్జిల దంగేటి వీరప్రసాద్‌లను అభినందించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల చొప్పున పరిహారం

ఇటీవల గోదావరిలో గల్లంతై మృత్యువాత పడ్డ బాలుర కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించి వెంటనే అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అవగాహన లేకుండా సరదాల కోసం స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం



ఉపాధి శ్రామికులతో 15 నిమిషాలు..

నాయకుడంటే ఎలా ఉండాలి.. ప్రజలతో మమేకం కావాలి.. వారి సమస్యలు తెలుసుకోవాలి.. వాటి పరిష్కారానికి మార్గాలు వెతకాలి.. చెయ్యేరు గ్రామంలో ఇటువంటి ఆసక్తికరమైన సంఘటనే చోటుచేసుకుంది. ఆ గ్రామంలో రూ.9.86 లక్షలతో చేపట్టనున్న చెరువు పూడికతీత పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. నరేగా పథకం కింద అక్కడ పనిచేస్తున్న ఉపాధి హామీ మహిళా శ్రామికులతో ముచ్చటించారు. వారితో కలిసి చెరువు గట్టున తిరుగుతూ ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల పథకంపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ పంపిణీలో లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా అని అడిగారు. గ్రామంలో ఉన్న టీడీపీ నాయకుల పనితీరు.. ఉపాధి కార్మికుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ చెరువులో పూడికతీత పనులు ఎంతకాలం ఉంటాయని ఉపాధి కూలీలను అడగ్గా, రెండు నెలల పాటు ఉంటాయని సమాధానమిచ్చారు. సుమారు పదిహేను నిమిషాల పాటు వారితో గడిపి పథకాల అమలుపై సమాధానాలు రాబట్టి సంతృప్తిని వ్యక్తంచేశారు.



ప్రజా వేదికపై చంద్రబాబు పక్కన నిలబడి సమస్య విన్నవిస్తున్న మహిళ.. చిత్రంలో మంత్రులు సుభాష్, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

అడిగింది లేదనకుండా.. అన్నీ ఓకే..!

చెయ్యేరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి హామీల వర్షం కురిపించారు. వృద్ధ గౌతమీ నదీపాయపై పల్లంకుర్రు- జి.మూలపాలెం మధ్య అసంపూర్తిగా ఉన్న వారధి నిర్మాణాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ముమ్మిడివరం- కాట్రేనికోన వంతెన, గోగులంక బ్రిడ్జి, కుండలేశ్వరం బ్లడ్‌బ్యాంక్ ఆధునీకరణ, చెయ్యేరులో చెరువును సీపీడబ్ల్యూ పథ కంలో మంజూరు చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు కోరారు. వీటికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను చంద్రబాబు వెంటనే ఆదేశించారు. చెయ్యేరు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని కోరారు.వీటికి యాక్షన్‌ప్లాన్ తయారుచేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ కావాలని కోరడంతో మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆగస్టు నాటికి బంగారు కుటుంబాల సర్వే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



మీ వెంటే ఉంటాం సార్ : ప్రజావేదిక సభలో ఒక మహిళ అభివాదం

సీఎంతో చిన్నారులు.. చిరు కోరిక!

అమలాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : నాడు సీఎం అంటే ప్రజలకు దూరం..దూరం.. నేడు సీఎం చిన్నారులకూ దగ్గరే.. చెయ్యేరు ప్రజావేదిక వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు చిన్నారులు ముఖ్యమంత్రితో మాట్లాడడానికి ప్రయత్నించారు.. అది గమనించిన సీఎం దగ్గరకు పిలిచి ఏం కావాలమ్మా అని అడిగారు.. అంతే చిన్నారుల్లో పట్టలేని ఆనందం.. అడిగిందే తడవుగా క్రికెట్ ఆడుకోవడానికి క్రికెట్ కిట్ కావాలి సార్ అంటూ కోరారు. అడిగిందే తడవుగా వెంటనే కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను పిలిచి వెంటనే చిన్నారులకు క్రికెట్ కిట్ అందించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చెయ్యేరు గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్ ద్వారా చిన్నారులకు క్రికెట్ కిట్ అందజేశారు. కిట్ అందుకున్న చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు.



ఏం కావాలో.. చెప్పండి : గ్రామంలోని పిల్లలతో ముచ్చటించి ఫొటో దిగిన దృశ్యం

క్రికెట్ కిట్ అందజేసిన దృశ్యం





నేనున్నా.. చెప్పండి : దివ్యాంగురాలి సమస్య విని అక్కడికక్కడే పెన్షన్ మంజూరు చేయించిన సీఎం

జిల్లాలో 91.33 శాతం తొలిరోజు పెన్షన్లు పంపిణీ

అమలాపురం టౌన్, మే31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఒకరోజు ముందుగానే శనివారం చేపట్టారు. ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం చెయ్యేరులో సీఎం చంద్రబాబు ఉపాధి హామీ శ్రామికులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌తోపాటు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పెన్షన్లను పంపిణీ చేశారు. తొలిరోజు జిల్లాలో 91.33 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేశారు. జిల్లావ్యాప్తంగా 2,34,668 మంది పెన్షన్ లబ్ధిదారులకుగాను 2,14,323మంది లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. పెన్షన్ లబ్ధిదారులకు రూ.100.68 కోట్ల నగదు విడుదలకాగా, తొలిరోజురూ.91.14 కోట్లు పంపిణీ చేశారు. ఒకరోజు ముందే పెన్షన్లు అందజేయడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేవు.



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేసిన మాలల ఐక్యవేదిక ప్రతినిధులు

సీఎం చంద్రబాబుకు మాలల వినతి

అమలాపురం టౌన్, మే31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 6 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వడం వల్ల మాలలకు తీరని అన్యాయం జరిగిందని మాలల ఐక్యవేదిక జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు అన్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. మాలలకు నష్టం లేకుండా 9:5 విధానంలో రిజర్వేషన్లు అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. మాలలకు నష్టం జరగకుండా రిజరేర్వషన్లు అమలు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, రేవు తిరుపతిరావుతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో కొబ్బరి ధరలు.. ఊపందుకున్న మార్కెట్



అంబాజీపేట,మే31(ఆంధ్రజ్యోతి): కోనసీమ కొబ్బరికి మంచిరోజులొచ్చాయి. కొబ్బరి పండించే దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడం, మన ప్రాంతంలో దిగుబడులు అంతంత మాత్రంగా ఉండడం, వర్షాల ప్రభావం.. ఇతర రాష్ట్రాల్లో శుభకార్యక్రమాలతో కొబ్బరి మార్కెట్‌లో ధరలు రికార్డు స్థాయిలో పెరిగి.. మార్కెట్ పుంజుకుంది. కొత్త కొబ్బరి కురిడీలలో రకాలైన పాతకాయ, కొత్తకాయ, గండేరా, గటగట ధరలతోపాటు నీటికాయ ధరలు భారీగా పెరిగాయి. నిత్యం ఉభయగోదావరి జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాలకు రోజుకు 40 లారీల వరకూ ఎగుమతులు అవుతున్నాయి.

ఇతర రాష్ట్రాలో తగ్గిన దిగుబడి..

కొబ్బరి పండించే తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడం కొబ్బరి ధరలు పెరగడానికి కారణంగా రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో కొబ్బరికాయల నాణ్యత బాగున్నప్పటికీ ధరలు ఆశించినంత మేర రాకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో మన ప్రాంతంలో ఉన్న కొబ్బరికాయల నాణ్యత, పరిమాణం తక్కువ ఉన్నపటికీ ధర వ్యత్యాసం ఉండడంతో ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతులు చేసుకుంటున్నారు. గత ఏడాది మే నెలలో కొత్త కొబ్బరి ధరలు క్వింటాల్‌కు రూ.9,500లు ఉండగా ప్రస్తుతం రూ.17,500కు చేరింది. పచ్చికొబ్బరి కాయలు వెయ్యింటికి రూ.15,000 ధర పలుకుతున్నాయి. గండేరా గటగట ధరలు కూడా గత నాలుగు నాలలు కిందట వరకు రూ.16 వేలు పలకగా, ప్రస్తుతం రూ.22 వేలు పైబడి పలుకుతోంది. పాత కాయలోని గండేరా రూ.22,500, గటగట రూ.20 వేలు, కొత్తకాయలో గండేరా రూ.21,500, గటగట రూ.19వేలకు ప్రస్తుతం ధర పలుకుతోంది. అయితే మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కొబ్బరి లేకపోవడంతో మార్కెట్‌లో ధరలు మరింత పెరిగాయని వ్యాపార విశ్లేషకులు చెబుతున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల నుంచి కొబ్బరికి మంచి ఆర్డర్లు రావడంతో కోనసీమలో కొబ్బరి ఎగుమతులు జోరుగా జరుగుతున్నాయి.

పెరిగిన నూనె ధరలు...

ఇతర రాష్ట్రాలకు కొబ్బరి నూనె ఎగుమతులు జోరుగా జరుగుతున్నాయి. ఈ ప్రభావం కూడా కొబ్బరి మార్కెట్‌లో ధరల పెరుగుదలకు కారణమవుతోంది. ప్రస్తుతం ఆయిల్ డబ్బా ధరలు రూ.4600 వరకూ ఉండడంతో కొబ్బరి ధరలు ఊపందుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు వీలుగా ఈ కొబ్బరినూనె అధికంగా ఎగుమతి చేస్తున్నారు.

నేటి నుంచి చౌక డిపోల ద్వారా రేషన్ పంపిణీ



- జిల్లాలో 923 రేషన్ దుకాణాలు పునఃప్రారంభం
- జిల్లావ్యాప్తంగా 355 ఎండీయూ వాహనాలకు మంగళం
- పండుగ వాతావరణంలో డిపోల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రేషన్ లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించేందుకు ఆదివారం నుంచి చౌక డిపోల ద్వారా అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జిల్లాలో పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో చౌక డిపోలను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో ఇంటింటికీ రేషన్ పేరిట ఆర్భాటంగా ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలను నిలిపివేస్తూ ఇటీవల కేబినేట్ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో ఉన్న 923 రేషన్ దుకాణాలు ద్వారా నిత్యావసర వస్తువులు ఇక నుంచి అందించనున్నారు. జిల్లాలో 5.47 లక్షల రేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు ఇతర నిత్యావసర వస్తువులను పౌర సరఫరాల శాఖ ద్వారా సరఫరా చేస్తారు. అయితే కొన్ని ఖాళీలు కూడా ఉండడంతో వాటి భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సమయంలోనే ఎండీయూ వ్యవస్థకు మంగళం పాడారు. అయితే ఎండీయూ వాహనాల ద్వారా గతంలో ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా అందకపోవడం, ఆ బియ్యం అక్రమ మార్గాల ద్వారా తరలిపోతున్నాయనే సమాచారంతో పాటు పేద ప్రజలు వ్యాన్ వచ్చే సమయం తెలియక రోజుల తరబడి ఉపాధి పోగొట్టుకుని ఎదురుచూస్తున్న పరిస్థితులపై ప్రభుత్వం కూలంకషంగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా ప్రాథమిక సమాచారం మేరకు అమలాపురం డివిజన్‌లో 406, రామచంద్రపురం డివిజన్‌లో 248, కొత్తపేట డివిజన్‌లో 269 వెరసి 923 చౌకడిపో దుకాణాలను పునరుద్ధరించనున్నారు. చౌకడిపోల పునరుద్ధరణ వల్ల ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏ సమయంలోనైనా లబ్ధిదారుడు చౌకదుకాణం వద్దకు వెళ్లి బియ్యం సహా ఇతర నిత్యావసర వస్తువులు పొందే వీలుంది. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టనుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

చెయ్యేరు మంచినీటి ప్రాజెక్టుకు నిధులివ్వండి : దాట్ల

2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్

ప్రజావేదిక సభలో కలెక్టర్

6

డెల్టా కాలువలకు నేడు నీటి విడుదల 6

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కరించి స్వాగతం పలుకుతున్న మంత్రి సుభాష్



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే చినరాజప్ప, రెడ్డి సుబ్రహ్మణ్యం



ఎమ్మెల్యే సుబ్బరాజును పలకరిస్తున్న సీఎం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కోనసీమ ఎస్పీ కృష్ణారావు, జేసీ నిషాంతి



ముమ్మిడివరం, మే 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో శనివారం 12.21 గంటలకు సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సీఎం పర్యటన ప్రోగ్రాం కన్వీనర్ పెందుర్తి వెంకటేష్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చిల్లా జగదీశ్వరి, మాజీ ఎంపీ ఏజే వీబీ మహేశ్వరరావు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, రాజ్యసభ సాన సతీష్, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ శాసనమండలి సభ్యుడు చిక్కాల రామచంద్రరావు, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నాయకులు మోకా ఆనంద్‌సాగర్, నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, టేకుమూడి లక్ష్మణరావు, తాడి నరసింహారావు, సాగి సూరిబాబురాజు, మోకా బాలప్రసాద్, కర్రా దుర్గాప్రసాద్, అత్తిలి బాబూరావు, దూడల స్వామినాయుడులతోపాటు పలువురు ఘనస్వాగతం పలికారు. తొలుత కార్యకర్తే అధినాయకుడు కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు), స్థానిక సర్పంచ్ గొలకోటి దొరబాబులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అడబాల సతీష్‌కుమార్, అర్థాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, బోనం కృష్ణ, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, యాళ్ల ఉదయ్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు 12.35 గంటలకు హెలిప్యాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో కాట్రేనికోన మండలం చెయ్యేరులో నిర్వహించే ప్రజాసేవ కార్యక్రమానికి హాజరయ్యారు.

చెయ్యేరు మంచినీటి ప్రాజెక్టుకు నిధులివ్వండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే దాట్ల వినతి



సమీక్షలో మాట్లాడుతున్న దాట్ల

ఐ.పోలవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజావేదికలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు ముమ్మిడివరం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు చేపట్టబోయే పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సుమారు పది నిమిషాలసేపు చంద్రబాబు ముందు సమస్యలను ఏకరువు పెట్టారు. వాటికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో జరిగిన పేదల సేవలో పీ4 కార్యక్రమాన్ని ముమ్మిడివరం నియోజకవర్గంలో నిర్వహించినందుకు చంద్రబాబుకు ఆయన తొలుత కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 42 వేలమందికి రూ.270 కోట్లు పింఛన్లు అందించడం జరుగుతోందన్నారు. పేదలకు అన్న క్యాంటీన్ల ద్వారా మంచిభోజనం అందిస్తున్నామన్నారు. రహదారులను అభి వృద్ధి చేయడంతోపాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. అయితే చెయ్యేరు గ్రామంలో తాగునీటిని బోరు ద్వారా అందించేవారమని, ఇటీవల చెరువుల వల్ల తాగునీటి కలుషితమైందన్నారు. ప్రస్తుతం చెరువును గత టీడీపీ హయాంలోనే రూ.18 కోట్లు మంజూరు చేసి తాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మంచినీటి పథకానికి నిధులు మంజూరుచేసి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని కోరారు. గ్రామానికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు పెండింగ్ పనుల జాబితా అందిస్తానని, వీటికి నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే కోరారు. ఎస్.మూలపాలెం వంతెనకు, ముమ్మిడివరం- కాట్రేనికోన వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామ కార్యదర్శి నివేదికను అందిస్తూ చెయ్యేరు గ్రామ జనాభా 7915 మంది, 2192 కుటుంబాలు ఉండగా, ఎన్టీఆర్ భరోసా కింద 1087 మందికి పింఛన్లు అందిస్తున్నామని, గ్రామంలో 141 బంగారు కుటుంబాలను గుర్తించగా, 9 మంది బంగారు కుటుంబాలను ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్టు తెలియజేశారు.

2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ : కోనసీమ కలెక్టర్



ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

అమలాపురం, మే 31(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజావేదికను ఉద్దేశించి తొలుత జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్వాగత ఉపన్యాసం చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు దార్శనికతతో రూపొందించిన 10 సూత్రాల విజన్ డాక్యుమెంట్లలో పేదరిక నిర్మూలనకు ప్రధాన స్థానం కల్పించారన్నారు. తొలుత సభాస్థలికి సుమారు 1.55 గంటలకు ప్రజావేదిక వద్దకు సీఎం చంద్రబాబు చేరుకున్నారు. ప్రజావేదిక వద్ద ఉన్న దివ్యాంగులతో చంద్రబాబు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను విన్న చంద్రబాబు పక్కనే ఉన్న జిల్లా కలెక్టర్‌ను వినతులను పరిష్కరించాలని ఆదేశించారు.

ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణకు తొలిసారిగా

కాకినాడలో ప్రత్యేక స్క్రీన్లు

బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ గైక్వాడ్, ఎంపీ సతీష్ కార్యాలయ ఇన్‌చార్జ్ లక్ష్మణమూర్తి



మీడియా సమావేశంలో పాల్గొన్న గైక్వాడ్, లక్ష్మణమూర్తి

కాకినాడ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణకు క్రికెట్ ప్రేక్షకుల కోసం కాకినాడలో తొలిసారిగా ప్రత్యేక స్క్రీన్లతో ఏర్పాట్లు చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ అల్విన్ గైక్వాడ్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి వెల్లడించారు. జూన్ 1,3 తేదీల్లో సాయంత్రం 6 గంటల నుంచి జరిగే సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు సంబంధించి స్క్రీన్లపై వీక్షించే ప్రేక్షకుల నిమిత్తం కాకినాడ కాస్మో పాలిటిన్ క్లబ్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. గైక్వాడ్, లక్ష్మణమూర్తి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఐపీఎల్ క్వాలిఫై, ఫైనల్ మ్యాచ్‌ల వీక్షణ కోసం కాకినాడలోని స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌లో 10 వేలమంది వీక్షించేలా పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. 1న పంజాబ్, ముంబై జట్ల మధ్య జరిగే క్వాలిఫై మ్యాచ్‌తో పాటు 3న జరిగే ఫైనల్ మ్యాచ్ వీక్షించేలా ఏర్పాట్లు జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్ మ్యాచ్‌లు ఎంతో ప్రాచుర్యం పొందాయని, అందులో భాగంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో క్రికెట్ ప్రేక్షకులకు కాకినాడలో పెద్ద స్క్రీన్లపై వీక్షించే అవకాశం కలిగిందన్నారు. క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న ఆయన కాకినాడలో స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అలాగే ప్రతిభగల యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తు న్నారన్నారు. అనంతరం ఐపీఎల్ ఫాన్ పార్క్ టీ షర్ట్‌లను ఆవిష్కరించారు.

శుభ కార్యానికి వెళ్తుండగా...

భార్య కళ్లెదుటే భర్త మృతి

- భార్యకు గాయాలు
- మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ



ప్రమాదంలో మృతిచెందిన సత్యభాస్కరావు, గాయపడిన భార్యకు సాయం చేస్తున్న ప్రయాణికులు



సత్యభాస్కరావు (ఫైల్)

రాజానగరం, మే 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీ ఢీకొని భర్త అక్కడికక్కడే మృతిచెందగా, భార్యకు గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన బిక్కిన సత్యభాస్కరరావు (69), భార్య పాపాయమ్మ శనివారం మోటార్ సైకిల్‌పై పెద్దాపురం మండలం కట్టమూరులో జరిగే శుభ కార్యానికి బయలుదేరారు. మార్గమధ్యంలో రాజానగరం- కలవచర్ల జంక్షన్‌లోకి వచ్చేసరికి ఏడీబీ రోడ్డు వైపునకు మలుపు తిరుగుతుండగా విజయవాడ నుంచి ప్లాస్టిక్ పైపుల లోడుతో వైజాగ్ వెళ్తున్న లారీ ఢీకొనడంతో అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో భాస్కరరావు తలకు వెనుక వైపు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య పాపాయమ్మకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మృతుడి కుమారుడు విదేశాల్లో ఉంటున్నాడు. ఈ మేరకు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో ఎస్.ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

సీలేరు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్

చీఫ్ ఇంజనీర్‌గా చిన్న కామేశ్వరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కామేశ్వరరావు

మోతుగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి) మోతుగూడెం లోయర్ సీలేరు ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ స్వామి నాయుడు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తోన్న సీడీ చిన్న కామేశ్వరరావు ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. కామేశ్వరరావుకు డీఈటీ వరప్రసాద్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంటు ఇంజనీర్ వరప్రసాద్, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, పలువురు యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్ చక్రాల కింద పడి వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన పైడారావు

బిక్కవోలు, మే 31 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో శనివారం సాయంత్రం ట్రాక్టర్ కింద పడి రెడ్డి పైడారావు(57) మృతిచెందాడు. ఎస్‌ఐ వి.రవిచంద్ర కుమార్ వివరాల ప్రకారం.. పందలపాకకు చెందిన రెడ్డి పైడారావు కొమరిపాలెంలోని ఒక రైసుమిల్లులో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పని ముగించుకుని వస్తుండగా తొస్సిపూడి వంతెన అదే గ్రామానికి చెందిన గుడిమెట్ల శ్రీనివాసరెడ్డి లిఫ్ట్ అడగగా అతడిని ఎక్కించుకుని వస్తూ పందలపాక కోదండరామా రైసు మిల్లు వద్ద ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా కుడి వైపుకు తిరగడంతో ఇద్దరు వెనుక చక్రం కింద పడిపోయారు. తీవ్రగాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పైడారావు మృతిచెందగా శ్రీనివాసరెడ్డి చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

విద్యుత్ షాక్‌తో దింపు కార్మికుడి మృతి



కొబ్బరిచెట్టుకు రాజ్‌కుమార్ మృతదేహం

అంతర్వేది, మే 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వీవీమెరక గ్రామం ప్రగతి నగర్‌లో దింపు కార్మికుడు బూసి రాజ్‌కుమార్ (నాని) (29) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ శనివారం ఉదయం 11 గంటలకు కొబ్బరిచెట్టు ఎక్కి దింపు తీస్తుండగా కొబ్బరి ఆకు 11కేవీ వైరుకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కొబ్బరిచెట్టుకు వేలాడుతూ మృత్యువాత పడ్డాడు. స్థానికుల సమచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని రైతు మృతి



నారాయణమూర్తి (ఫైల్‌ఫొటో)

అలమూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందాడు. మూలస్థాన అగ్రహారానికి చెందిన తోరాటి నారాయణమూర్తి (44) అనే రైతు ఉదయం తన పొలం పనులు ముగించుకుని తన గ్రామం పక్కనే ఉన్న జొన్నాడకు సైకిల్ వెళ్లి పశువుల దాణా తీసుకుని వస్తుండగా మూలస్థానం వచ్చేసరికి రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రా వెల్స్ బస్సు వస్తువులు భద్రపరిచే డోర్ తెరచి ఉండటంతో సైకిల్‌పై వస్తున్న నారాయణమూర్తిని ఢీకొంది. దీంతో బలంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందినట్టు అలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

సత్యదేవుడికి వేడుకగా పల్లకీసేవ



ఆలయం లోపల పల్లకీసేవ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం పల్లకీసేవ వేడుకగా జరిగింది. ప్రతీ శనివారం ప్రాకార సేవ నిర్వహిస్తుండగా ఆ సమయంలో వాతావరణం సరిగా లేకపోవడంతో అర్చకులు పల్లకీ సేవ నిర్వహించారు. ప్రధానాలయ గోపురాల నడుమ ముమ్మారు స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఉంచి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణతో వేడుకగా జరిగింది.

ఐఏఎస్ కృష్ణతేజ ప్రత్యేక పూజలు

సత్యదేవుడి సన్నిధిలో శనివారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యక్తిగత కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణతేజ కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు

పాముకాటుకు వ్యక్తి మృతి



పాంగి రమేష్ (ఫైల్‌ఫొటో)

మోతుగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతరామరాజు జిల్లా వై.రామవరం మండలం డొంకరాయి గ్రామానికి పాంగి రమేష్ పాము కాటుకు మృతి చెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా రమేష్‌ను పాము కాటు వేసింది. డొంకరాయి జెన్కో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శనివా రం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదుపై డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డెల్టా కాలువలకు నేడు నీరు విడుదల

ధవళేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రబీ అనంతరం మూసివేసిన డెల్టా కాలువలకు ఆదివారం ఉదయం నీటిని విడుదల చేయనున్నారు. నిర్ణయించిన ముహూర్తం మేరకు గోదావరి మాతకు పూజలు చేసి ఆయా డెల్టా కాలువల పరిధిలో హెడ్ స్లూయిజ్ గేట్లను ఎత్తి అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. కాల్వలకు నీటి విడుదల చేయనున్న నేపథ్యంలో సిబ్బంది హెడ్ స్లూయిజ్‌ల వద్ద మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేస్తున్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు

ద్రాక్షారామ, మే 31 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం అన్నాయిపేట గ్రామానికి చెందిన కొప్పిశెట్టి నారాయణ రావు(45) మృతిపై ద్రాక్షారామ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణరావు, పెంకె ప్రసాద్ స్నేహితులు. శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో నారాయణరావును ప్రసాద్ బయట నుంచి తీసుకొచ్చి ఇంటి వద్ద దింపి వెళ్లాడు. తిరిగి ప్రసాద్ మళ్లీ ఫోన్ చేయడంతో మళ్లీ బయటకు వెళ్లారు. అర్ధరాత్రి 12 దాటిన తన భర్త ఇంటికి రాకపోవడంతో నారాయణరావు భార్య సంధ్యారాణి ప్రసాద్‌కు ఫోన్ చేయగా నారాయణరావు కుప్పకూలిపోవడంతో ఆసుపత్రికి తరలించినట్టు ప్రసాద్ తెలిపాడు. దీంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో సంధ్యారాణి తన భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ పేర్కొన్నారు.

డిపోల ద్వారా

రేషన్ పంపిణీకి నేడు శ్రీకారం

పిఠాపురంలో ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

పిఠాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నారు. స్థానిక నూకాలమ్మ గుడి వద్దనున్న దుకాణంలో సరుకులను కార్డుదారులకు అందిస్తారు. అంతకు ముందు పాదగయ క్షేత్రంలో దివీస్ ల్యాబ్స్ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ఆర్వో వాటర్ ప్లాంట్లు (కుక్కుటేశ్వర జలప్రసాదం)ను ప్రారంభించి, సకలేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని జనసేన వర్గాలు తెలిపాయి.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం సాయంత్రం జరగనున్నది. చైర్మన్‌గా వాకపల్లి దేవి సూర్యప్రకాష్, వైస్‌చైర్మన్‌గా గాది రాజబాబు, ఇతర డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల పాల్గొంటారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

5న ఏపీ ఎడ్‌సెట్-2025

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 పరీక్షా కేంద్రాలు

ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారావు



సుబ్బారావు

దివాన్‌చెరువు, మే31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 5న రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఏపీఎడ్‌సెట్-2025 పరీక్ష ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 12 కేంద్రాల్లో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల ప్రిన్సిపాల్, ఏపీఎడ్‌సెట్-2025 ప్రాంతీయ సమన్వయకర్త కొండ్రు సుబ్బారావు తెలిపారు. ఈ పరీక్షకు తనను ప్రాంతీయ సమన్వయకర్తగా ఎడ్‌సెట్ కన్వీనర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారని శనివారం తెలిపారు. ఎడ్‌సెట్ పరీక్షకు దాదాపు 2500 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం అవుతుందని, విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ పరీక్షకు పరిశీలకులుగా ఉభయ గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నుంచి సీనియర్ ప్రొఫెసర్‌లను నియమించామన్నారు. కాగా ఏపీఎడ్‌సెట్‌కు ప్రాంతీయ కోఆర్డినేటర్‌గా నియమితులైన సుబ్బారావును వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అభినందించి పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

స్త్రీ శక్తికి ప్రతిరూపం అహల్యాబాయి

చత్తీస్‌ఘడ్ డిప్యూటీ సీఎం అరుణ్ సావ్



అరుణ్ సావ్‌ను సత్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న అరుణ్ సావ్

రాజమహేంద్రవరం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తికి ప్రతిరూపం రాణి అహల్యాబాయి హోల్కర్ అని చత్తీస్‌ఘడ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అరుణ్ సావ్ అన్నారు. తాను రాజమండ్రి రావడం ఎంతో ఆనందం కల్గించిందని, రాజమండ్రి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సాంస్కృతిక రాజధాని అని పేర్కొన్నారు. శనివారం అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచన మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అరుణ్ సావ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆనాడు అహిల్యబాయి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలన్నీ నేడు ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందేలా అహల్యాబాయి ఆనాడే కృషి చేశారన్నారు. అందరి వికాసం, సంస్కృతి వికాసం జరగాలన్నది ప్రధాని మోదీ లక్ష్యమని, అందుకే బీజేపీ ఈ కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. పురందేశ్వరి విదేశాలకు వెళ్లి.. పాకిస్థాన్‌పై భారతదేశం ఆపరేషన్ సిందూర్ ఎందుకు చేపట్టిందనే విషయాన్ని, మన దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచదేశాలకు చాటిచెప్పే ప్రయత్నంలో ఉన్నారన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అహల్యాబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ అహల్యాబాయి.. తన భర్త ఇచ్చిన అక్కౌంటు సరిగాలేదని తిరస్కరించిన దేశమాత, ధీరోత్తమురాలు అని అన్నారు. చరిత్ర, వారసత్వ సంపదను పరిరక్షించే పార్టీ బీజేపీ అని అన్నారు. రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ అహల్యాబాయి జీవిత విశేషాలను, సాహసోపేత కార్యక్రమాలను వివరించారు. ముందుగా వై.జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, లక్ష్మీ ప్రసన్న, హారిక, స్వర్ణ రజని, తపన చౌదరి, పరిమి రాధ, రొంగల గోపి, వీరా వీరాంజనేయులు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు పూజలు

ఆత్రేయపురం, మే 31(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు.

మందపల్లి ఆదాయం రూ.1.91లక్షలు

కొత్తపేట, మే 31(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూ కట్టారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,91,447 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన నేతలు





సీఎం చంద్రబాబునాయుడును కలిసిన ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు





సీఎం చంద్రబాబును కలిసిన నామాన రాంబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, సీఎంకు స్వాగతం పలుకుతున్న ఏసీ సత్యనారాయణ, వేదపండితులు

మలికిపురం, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు శనివారం ముమ్మిడివరం పర్యటనకు వచ్చిన నేపథ్యంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలు ముఖ్యమంత్రికి వివరించినట్టు ఎమ్మెల్యే దేవ తెలిపారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబునాయుడు పర్యటన నేపథ్యంలో చెయ్యేరు గున్నేపల్లి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా జరుగుతుందని సీఎం ప్రశ్నించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధిలో ఎక్కడా రాజీపడొద్దని సీఎం సూచించారని తెలిపారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): కోనసీమ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ కలిశారు. ఈసందర్భంగా అంబాజీపేటలో అసంపూర్తిగా నిలిచిపోయిన అన్నక్యాంటీన్, తహశీల్దారు కార్యాలయ భవనాలను పూర్తిచేయాలని, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు పింఛన్ ఇవ్వాలని వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో పర్యటనలో భాగంగా సీహెచ్.గున్నేపల్లిలో శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారిని సీఎం చంద్రబాబు దర్శించుకున్నారు. తొలుత జిల్లా ఏసీ వి.సత్యనారాయణ, అంతర్వేది ఆలయ వేదపండితులు చింతా వెంకటశాస్త్రి సీఎంకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆచార సంప్రదాయాలతో అమ్మవారిని దర్శించుకున్న చంద్రబాబుకు వేదపండితులు వేదాశీర్వచనం అందించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గం సీహెచ్ గున్నేపల్లి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శనివారం జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సీఎం తన క్షేమ సమాచారాలు అడిగితెలుసుకున్నారని నామన తెలిపారు. ప్రభుత్వ పథకాలు అమలుపై నామన హర్షం వ్యక్తం చేశారు.

సీఎం సభాస్థలి వద్ద అర్జీల స్వీకరణ




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం, భోజనాలు ఏర్పాటుచేసిన దృశ్యం

ఐ.పోలవరం, మే 31(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా సభాస్థలి సమీపంలో అర్జీలు స్వీకరించారు. దీనికి సంబంధించి ప్రత్యేక డెస్క్ ఏర్పాటుచేసి ప్రజావేదికకు హాజరైన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్ చేశారు. వీటిన్నంటినీ ప్రజావేదికలో పాల్గొన్న చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు

ఐ.పోలవరం, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. కాట్రేనికోన మండలం చెయ్యేరులో శనివారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమానికి సంబంధించి సభాస్థలి వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అలాగే సీహెచ్ గున్నేపల్లి హెలిప్యాడ్ సమీపంలో సత్తెమ్మతల్లి ఆలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటుచేసి వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా ప్రజావేదికకు హాజరైన జనం వైద్య శిబిరం వద్ద వైద్యసేవలు పొంది మందులు తీసుకున్నారు.

భోజనాల ఏర్పాటు

ఐ.పోలవరం, మే 31(ఆంధ్రజ్యోతి): చెయ్యేరులో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా జడ్పీ స్కూలులో జనానికి భోజన సౌకర్యం కల్పించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చెయ్యేరు గ్రామంలో ఏర్పాటుచేసిన ప్రజావేదిక కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, జనానికి భోజన సౌకర్యం కల్పించారు. చెయ్యేరులో జరిగిన ప్రజావేదికలో సీఎం ప్రసంగిస్తుండగా డిజిటల్ స్ర్కీన్లు మొరాయించడం జనం అసహనానికి గురయ్యారు. ప్రజావేదిక జరుగుతున్న సమయంలో వంద మంది జనం కుర్చీలు ఎక్కి ఎగబడ్డారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు మైకు తీసుకుని వారిని కిందకు దిగి సహకరించాలని వారించారు.

సీఎం సభకు తరలివచ్చిన నాయకులు

ఐ.పోలవరం, మే 31(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చెయ్యేరులో శనివారం జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సభకు ఐ.పోలవరం మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృథ్వీ, కాకర్లపూడి రాజేష్, లంకలపల్లి బుల్లియ్య, బొంతు శ్రీరాములు, తోట వెంకటేష్ తరలివచ్చారు. సమావేశం అనంతరం కార్యకర్తలు, నాయకులతో విడివిడిగా ఫొటోలు దిగి వారిని ఉత్సాహపర్చారు.

బాలబాలాజీకి విశేష పూజలు




మామిడికుదురు, మే 31(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాలతో పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేకువజామున సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో భోజనాలు చేశారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. స్వామివారి నిత్యాన్నదాన పథకానికి వేల్పూరికి చెందిన రెడ్డి అపర్ణ కుటుంబ సభ్యులు రూ.10వేలు విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

అంబాజీపేట, మే 31(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట వీరభద్ర థియేటర్ సమీపంలోని శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం దర్శించుకున్నారు. ఆలయం 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు గుడారి వీరభద్రం బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యేను స్థానికులు సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బండారు ఆదినారాయణమూర్తి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, వాసంశెట్టి కుమార్, షైపాల తాతాజీ, నాగాబత్తుల సుబ్బారావు, దొమ్మేటి శ్యామ్, బండారు దుర్గారావు, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల సూరిబాబు పాల్గొన్నారు.

యానాంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్



క్రీడాకారులతో యానాం అభిమానసంఘ ప్రతినిధులు

యానాం, మే 31(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజును పురస్కరించుకుని అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈటోర్నమెంట్‌లో 10జట్లు పాల్గొన్నాయి. ఈపోటీలను అభిమాన సంఘ నాయకులు పెండెం సూర్యప్రకాష్, మల్లాడి శామ్యూల్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో పోటీలు జరుగుతున్నాయి. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. యానాన్ని క్రీడా హబ్‌గా చేసిన ఘనత మల్లాడి కృష్ణారావుకే దక్కుతుందన్నారు. ఈపోటీల్లో విన్నర్‌కు రూ.15వేలు, రన్నర్‌కు రూ.10వేలు అందిస్తామన్నారు. విజేతలకు జూన్ 6న జరిగే మల్లాడి పుట్టినరోజు వేడుకల్లో బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గూటం శివగణేష్, పోలిమారి సత్యనారాయణ, ఇసుకపట్ల పాపారావు, చింత వెంకన్న, చింతాం రామకృష్ణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు వడ్డి వరప్రసాద్, మల్లవరపు దయ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

మలికిపురం, మే 31(ఆంధ్రజ్యోతి): కత్తిమండలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాజన్ తెలిపారు. శనివారం కత్తిమండ సర్పంచ్ ఆరేటి రంగనాయకులతో కలిసి పరిస్థితులను సమీక్షించారు. గ్రామశివారు ప్రజలకు నీటిని అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

వినాయక ఆలయానికి పోటెత్తిన భక్తులు



అయినవిల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. నాలుగు పంచామృతాభిషేకాలు, లఘున్యాసాలు 52, పరోక్ష అభిషేకాలు 3, ఉండ్రాళ్ల పూజ 13, లక్ష్మీగణపతి హోమం 19, నామకరణం 1, ప్రత్యేక దర్శనాలు 434, అన్నప్రాసన 12, అక్షరాభ్యాసం 8, ద్విచక్ర వాహనపూజలు 20, పులిహోర 1587, లడ్డూ 1780, అన్నప్రసాదం 2900, అన్నప్రసాద విరాళం రూ.1.95లక్షలు, విరాళం రూ.32,458 వెరసి మొత్తం రూ.3,77,996 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ




అమలాపురం, పి.గన్నవరంలలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యేలు ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ

అమలాపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంతో పాటు మండల పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ యేడిద శ్రీనుతో పాటు దున్నాల దుర్గ, వలవల శివరావు, జంపన సుమన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా ఆధ్వర్యంలో సాకుర్రు, గున్నేపల్లి అగ్రహారం గ్రామాల్లో పెన్షన్లు పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో బండారులంకలో పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పొలమూరి ధర్మపాల్, మావూరి శివ పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల ఒకటో తేదీన అందించే పెన్షన్లను ఒకరోజు ముందే శనివారం పెన్షన్‌దారులకు అందజేశామని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ తెలిపారు. రాజోలులో పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. పెంచిన పెన్షన్లను సమయానికి అందజేస్తూ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో రాజోలు గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల విజయ్, ప్రధాన కార్యదర్శి కడలి వెంకటరమణారావు, సర్పంచ్ రేవు జ్యోతి, కార్యదర్శి రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ముంగండలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందించి అనంతరం మాట్లాడారు. పింఛన్‌దారులకు ఇబ్బంది లేకుండా సకాలంలో నగదు అందిస్తున్న సచివాలయ సిబ్బందిని, మండల స్థాయి అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్ర మంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ కుసుమ చంద్రకళ, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, వాసంశెట్టి కుమార్, పెచ్చెట్టి వెర్రియ్య, శేరు శ్రీనుబాబు, అంబటి కోటేశ్వరరావు, నిమ్మకాయల శేషు, భావన శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణామూర్తి వార్షికోత్సవం

అంబాజీపేట, మే 31(ఆంధ్రజ్యోతి): ఇరుసుమండ శ్రీబాలాత్రిపుర సుందరి సమేత ఆనందరామేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీమేధా దక్షిణామూర్తి ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సుంకర స్వామినాయుడు, సీతారామదాసునాయుడు దంపతులు మేధా దక్షిణామూర్తికి గణపతి పూజ, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

మనందరిలో మార్పుతో .. మలేరియా అంతం సాధ్యం



అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద మలేరియా అంతం బ్యానర్లను ఆవిష్కరించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావుదొర

అమలాపురం టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): మనందరిలో మార్పుతో మలేరియా అంతం సాధ్యం అనే నినాదంతో జూన్ 1 నుంచి 30 వరకు మలేరియా నివారణామాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర తెలిపారు. అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద శనివారం మలేరియా అంతం బ్యానర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే సాధ్యమనే విధంగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమతెరలు వాడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాల వద్ద మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని సబ్‌యూనిట్ ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి 3 నుంచి ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, మే31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలో 2025-26 సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 3 నుంచి 10 వరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో వారికి కేటాయించిన షెడ్యూల్ ప్రకారం ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. 3న 1నుంచి 159 మెరిట్‌నంబరు వరకు, 4న 160 నుంచి 325 వరకు, 5న 326నుంచి 484వరకు, 6న 485నుంచి 634 మెరిట్ నంబరు వరకు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఇంటర్వ్యూల అనంతరం మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం జనరల్ కేటగిరిలో 9, 10తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. సీట్లు రానివారు, షెడ్యూల్ ప్రకారం ఇంటర్వ్యూలకు హాజరుకానివారి కోసం జూన్ 9,10 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఈఅవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమ్మవార్లకు వెండి కిరీటాల బహూకరణ

అంతర్వేది, మే 31(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెం గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవతలు ముత్యాలమ్మ, మారెమ్మ, గంట్లమ్మ, మహాలక్ష్మ్మ అమ్మవార్లకు అదే గ్రామానికి చెందిన పొన్నాల నరసింహమూర్తి-రమణమ్మ దంపతుల కుమారుడు పొన్నాల రామకృష్ణ-లక్ష్మీ దంపతులు వెండి కిరీటాలు బహూకరించారు. రూ.4లక్షల విలువైన వెండి కిరీటాలు సంప్రోక్షణ అనంతరం అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం వారు అన్నసమారాధన నిర్వహించారు. దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు.

సైకిల్ ర్యాలీని విజయవంతం చేయండి

మలికిపురం, మే 31(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుదాం.. పర్యావరణం కోసం సైకిల్ తొక్కుదాం అనే నినాదంతో జూన్ 3న జరిగే ప్రపంచ సైకిల్ దినోత్సవంలో అందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. మలికిపురం డిగ్రీ కళాశాల నుంచి సఖినేటిపల్లి మూడు తూముల సెంటర్ మీదుగా మలికిపురం గాంధీబొమ్మ సెంటర్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నటు తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం కోసం స్టీలు, రాగి బాటిల్‌తో మంచినీటిని తెచ్చుకోవాలని, తెలుపురంగు దుస్తులు ధరించాలని కోరారు.

రత్నకుమారి సేవలు మరువలేనివి

రాజోలు, మే 31(ఆంధ్రజ్యోతి): విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి మేడిది రత్నకుమారి సేవలు మరువలేనివని సీనియర్ న్యాయవాది మాకే దేవీప్రసాద్ శనివారం అన్నారు. కడలిలో న్యాయవాది యాలంగి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన రత్నకుమారి సంతాప సభకు ఆయన మాట్లాడారు. రత్నకుమారి సూపరింటెండెంట్‌గా కస్టమర్లకు అనేక సేవలు అందించారని తెలిపారు. తొలుత రత్నకుమారి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. డాక్టర్ యాలంగి పద్దయ్య, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు తోట సురేష్‌కుమార్, ఇంజేటి సువర్ణరాజు, బొడ్డపల్లి పులయ్య, సుంకర శ్రీను, పినిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం

రాజోలు, మే 31(ఆంధ్రజ్యోతి): రాజోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాజోలు రోటరీ భవనంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్టు రాజోలు రోటరీక్లబ్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ తెలిపారు. వంద మందికి వైద్య పరీక్షలుచేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడ్ యునైటెడ్ డైరెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో వైద్యులు ఉదయ్‌కుమార్, సుధీర్, ప్రవీణ్‌రావు, లక్ష్మీలు రోగులను పరీక్షించారు. రాజోలు రోటరీక్లబ్ కార్యదర్శి కోదాడి సోమరాజు, దార్ల పెదబాబు, కసుకుర్తి రామకృష్ణ, మహ్మద్‌కిశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయ్ హోల్కర్ జయంతి

అయినవిల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): అహల్యాబాయిహోల్కర్ 300వ జయంతి కార్యక్రమాలు బీజేపీ కిసాన్‌మోర్చా మండలశాఖ అధ్యక్షుడు వేటుకూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అహల్యాబాయ్ చరిత్రను తెలియచేస్తూ మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని చైతన్యవంతుల కావాలని పిలుపునిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, యనమదల వెంకటరమణ, వేడుకూరి ప్రసాదరాజు, బోసురాజు, సత్తిరాజు, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం

మామిడికుదురు, మే 31(ఆంధ్రజ్యోతి): గోగన్నమఠంలో వేంచేసి ఉన్న శ్రీచతుర్భుజ భద్రాది సీతారామస్వామి, శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామివార్ల కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ దశమ వార్షికోత్సవంలో భాగంగా వేదమంత్రోచ్చారణలతో అర్చకులు స్వామివారి మూలమూర్తులకు విశేషాభిషేకాలు జరిపించారు. పలువురు దంపతులు కర్తలుగా పాల్గొనగా కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అధికసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించి స్వామి-అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం



అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవంలో భాగంగా ప్రదర్శన నిర్వహిస్తున్న కిమ్స్ కళాశాల విద్యార్థులు

అమలాపురం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అమలాపురం కిమ్స్ దంత వైద్య కళాశాల విద్యార్థులు, శిక్షణార్థులతో కలిసి ప్రదర్శనలు నిర్వహించారు. పొగాకు వాడకంతో కలిగే అనర్థాలను వివరిస్తూ ఫ్లెక్సీలు, ప్లకార్డులు, బోర్డులతో ప్రదర్శన నిర్వహించారు. పొగాకు వాడడం వల్ల కలిగే నష్టాలు వివరిస్తూ అమలాపురం ఆర్టీసీ బస్ డిపోలో వైద్యవిద్యార్థులు ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. పొగాకు వినియోగం వల్ల హృదయ సంబంధ, శ్వాసకోశ వ్యాధులతో పాటు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఏవిధంగా తలెత్తుతాయో వివరించారు. పొగాకును బహిష్కరిద్దాం. భవిష్యత్తు తరాలను రక్షించుకుందామంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, జేఎండీ శేషవవిత్ర అభినందించారు.

పొగాకు ఆరోగ్యానికి హానికారం

అంబాజీపేటలో అవగాహన ర్యాలీ

అంబాజీపేట, మే 31(ఆంధ్రజ్యోతి): పొగ తాగడం వల్ల ఊపిరితిత్తులు దెబ్బతినడమే కాకుండా కేన్సర్‌కు దారితీస్తుందని వైద్యాధికారులు కేఎన్ శ్రీనివాస్, టి.దివ్యశ్రీ అన్నారు. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో పొగాకు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగతాగే వారితో పాటు పీల్చే వారికి హానికరమన్నారు. ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులదే గురుతర బాధ్యత

మలికిపురం, మే 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి బుద్ధులు నేర్పించి ఉన్నతమైన సమాజాన్ని ఏర్పాటు చేయడంలో ప్రముఖ పాత్ర అధ్యాపకులదేనని మలికిపురం ఏఎస్‌డీటీ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుమలు సోమశేఖర్ అన్నారు. మలికిపురం ఏఎస్‌డీటీ ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేసిన ముప్పర్తి వీరవెంకటసత్యనారాయణ దంపతులను ఉద్యోగ విరమణ సన్మానోత్సవ సభలో నూతన వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్వీ రామరాజు, కేవీ సత్యనారాయణ, తేతలి సత్యనారాయణ, సుంకర వెంకటరత్నం, డాక్టర్ కేవీ ఆనంద్, మంగెన రంగనాథరావు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, జాన శంకరరావు పాల్గొన్నారు.

నేడు నర్సింగ్ పోస్టులకు రాత పరీక్ష

యానాం, మే 31(ఆంధ్రజ్యోతి): యానాంలో జిప్‌మెర్ మల్టీస్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేయడానికి సంబంధించి అభ్యర్థులకు ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్నారు. స్థానిక మెట్టకుర్రులోని రీజెన్సీ పబ్లిక్ పాఠశాలలో ఉదయం 10నుంచి 11గంటల వరకు రాత పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు.

రేషన్ బియ్యం పంపిణీపై బీజేపీ హర్షం

అంతర్వేది, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఇంటి ముంగిట్లోనే రేషన్ అందిస్తామని చెప్పినా ఎండీయూ వాహనాల కోసం లబ్ధిదారులు పడిగాపులు పడాల్సి వచ్చేదని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యాన్ని మాత్రమే లబ్ధిదారులు ఇచ్చి, నాడు జగన్ ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచిత బియ్యాన్ని ఇవ్వకుండా చేతులు దులుపుకుందని బీజేపీ జిల్లా అధికారప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ విమర్శించారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాలను పునఃప్రారంభించి రేషన్ పంపిణీ చేయాలనే నిర్ణయంపై బీజేపీ హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం ద్వారా ఇస్తున్న ఉచిత బియ్యాన్ని కాకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ.1కే ఇవ్వాల్సిన బియ్యాన్ని కూడా పంపిణీ చేస్తే లబ్ధిదారులకు మరింత ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర డ్రైనేజీసెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణరాజు, మండలపార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్, ప్రధాన కార్యదర్శి బోనం నాయుడు, పోతురాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసింహ స్వామిని దర్శించుకున్న ఫిలిప్పైన్స్ దేశస్తులు



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఫిలిప్పైన్స్ దేశస్తులు

అంతర్వేది, మే 31(ఆంధ్రజ్యోతి) అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఫిలిప్పిన్స్ దేశస్తులు కుటుంబ సమేతంగా విచ్చేశారు. మామిడికుదురుకు చెందిన గెద్దాడ శ్రీనివాస్ ఫిలిప్పిన్స్‌కు చెందిన మరియట్ల లరినోను వివాహం చేసుకున్నాడు. పిల్లలు మనిగర్‌సానే, నేహిత పైనాతో వారు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అంతర్వేది ఆలయ పుణ్యక్షేత్ర విశిష్టతను, అన్నప్రసాదం, కోనసీమ అందాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయని వారు తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



ముమ్మిడివరంలో చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు వేగుళ్ల, ఆనందరావు, బండారు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు

మండపేట, మే 31(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పలువురు ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సీఎంను కలిసి పలు అంశాలపై కొద్దిసేపు చర్చించారు.

నేటి నుంచి రేషన్ షాపుల వద్దే బియ్యం పంపిణీ

కొత్తపేట, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంపై రేషన్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నుంచి రేషన్ షాపుల వద్దే బియ్యం పంపిణీ చేపట్టనున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ నిర్ణయంపై రోజు కూలీలు, వ్యవసాయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎండీయూ వాహనాలు ముఖ్య కూడళ్లలో పెట్టి రేషన్ పంపిణీ జరిపేవారు. దీంతో పనులు మానుకుని రేషన్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎక్కువ శాతం లబ్ధిదారులు రేషన్ తీసుకునే అవకాశం కోల్పోయేవారు. ఇప్పుడు ఈ వ్యవస్థ మారడం ద్వారా ఖాళీ సమయంలో రేషన్ సరుకులు తెచ్చుకునే వీలుంటుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎండీయూ వాహనాల అజమాయిషీలో రేషన్ డీలర్లు అనేక ఇబ్బందులుపడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో రేషన్ నిర్వహణ ఆయా డీలర్లకు అప్పచెప్పడంతో వారు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిందూర్ విజయంపై బీజేపీ తిరంగా యాత్ర



తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కొత్తపేట, మే 31(ఆంధ్రజ్యోతి): దేశసైనికుల ఆత్మస్థైర్యం పెంపొందించేలా తిరంగ యాత్ర దోహదపడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పేర్కొన్నారు. శనివారం మండల అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో తిరంగా యాత్రను ఆయా ప్రాంతాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విళ్ళ మారుతీప్రసాద్, అయినవిల్లి సత్తిబాబు, వాసంశెట్టి సత్యనారాయణ, పాలూరి జయప్రకాశ్ నారాయణ, గొలకోటి వెంకటేశ్వరరావు, భమిడిపాటి లక్ష్మీనారాయణ, తమ్మన సాయిప్రసాద్, కోటిపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పెదపళ్ల పీహెచ్‌సీ సిబ్బంది అధ్వర్యంలో పొగాకు వ్యతిరేక ర్యాలీ నిర్వహించిన దృశ్యం

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఆలమూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ జరిపారు. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది అధ్వర్యంలో పొగాకు వ్యతిరేక ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలుపుతూ వాటికి దూరం ఉండాలని కోరుతూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యులు ఎ.రామకృష్ణ, హెచ్‌ఈ రాజా అక్కుల, సీహెచ్‌వో ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్‌లు శ్రీనివాస్, ఉమ తదితరులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వారు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి, వెంకటేశ్వరరావు, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం అంగరలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



చెల్లూరులో హైస్కూల్‌లో ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తున్న నేతలు

దాత వితరణతో హైస్కూల్‌లో పెయింటింగ్ పనులకు శ్రీకారం

రాయవరం, మే 31(ఆంధ్రజ్యోతి): చెల్లూరు సర్వారాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాత ఇచ్చిన నిధులతో శనివారం పెయింటింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. సర్వారాయ షుగర్స్ ఎండీ బలుసు కృష్ణమోహన్ వితరణతో పాఠశాల భవనానికి రంగులు వేసేందుకు రూ.8లక్షలు అందజేశారు. పాఠశాలలో ఉన్న వినాయకుడి వద్ద పూజలు చేసిన అనంతరం వాటి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, మోరంపూడి రాజ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ నూనె శ్రీదేవి, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, కాదా శ్రీను, బవిరిశెట్టి అప్పారావు, శ్రీని చిట్టిబాబు, కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయం రంగంలో

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

రావులపాలెం, మే 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని పొడగట్లపల్లి, రావులపాడు, దేవరపల్లి గ్రామాల్లో ఏవో మీనా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పతాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. కృషి విజ్ఞాన కేంద్రం సభ్యులు వీఎస్‌జీఎస్ నాయుడు, రాజశేఖర్, లక్ష్మీపతి, సంజయ్ హెగ్డే, మనోహర్ పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన, డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళలకు రాయితీపై డ్రోన్స్ ఇస్తామన్నారు.



దేవరపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, మే 31(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,91,447 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

ఆత్రేయపురం, మే 31(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం తరచూ భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన పైడిశెట్టి దుర్గాభవానికి విజయవాడకు చెందిన పైడిశెట్టి వీరవెంకట దుర్గాగణేష్‌తో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నకానుకలు, లాంఛనాలు అందచేశారని తెలిపారు. కొంత కాలం నుంచి గణేష్ తరచూ భార్యను అదనపు కట్నం కోసం శారీరక, మానసికంగా వేధిస్తున్నాడన్నారు. దీంతో భవాని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఆయన తెలిపారు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



చొప్పెల్లలోని నూతన ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ దృశ్యం

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు, మే 31(ఆంధ్రజ్యోతి): చొప్పెల్ల గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా జరిపారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిలమైపోవడంతో గ్రామస్తులు పునర్నిర్మించారు. విగ్రహ పతిష్ఠను కాళ్లకూరి కాశీశేఖర్‌బాబు అధ్వర్యంలో కాళ్లకూరి రవితేజశర్మ బ్రహ్మత్వంలో పలువురు వేదపండితులు ఉత్సవాలను నిర్వహించారు. శనివారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజల అనంతరం భక్తుల దర్శనానికి అనుమతిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యోగాంధ్ర పోర్టల్‌లో ఉద్యోగులు నమోదు కావాలి

రాయవరం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదు కావాలని ఎంఈవో-2 వై.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు యోగాంధ్ర పోర్టల్‌లో నమోదు కావాలని, యోగా రిజిస్ట్రేషన్లు చేయించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ద్రాక్షారామ, మే 31(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, 132 కేవీ డబుల్ సర్క్యూట్‌లో పాడైపోయిన టవర్లను తొలగించి కొత్తవి వేయనున్నారు. ఈ నేపథ్యంలో ద్రాక్షారామ సెక్షన్‌లోని నెలపర్తిపాడు, గణపతినగరం, మామిడికుంట, జగన్నాయకులపాలెం, జగనన్నకాలనీలకు ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డివిజనల్ కార్యనిర్వాహక ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మండపేట, మే 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. మండపేటలో శనివారం వైసీపీ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, వైసీపీ నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య, రెడ్డి రాధాకృష్ణ, పాపారాయుడు, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్వేదిలో ఫిలిప్పైన్స్‌వాసుల పూజలు

అంతర్వేది, మే 31(ఆంధ్రజ్యోతి) అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఫిలిప్పైన్స్ దేశస్తులు కుటుంబ సమేతంగా విచ్చేశారు. మామిడికుదురుకు చెందిన గెద్దాడ శ్రీనివాస్ ఫిలిప్పీన్స్‌కు చెందిన మరియట్ట లరినోను వివాహం చేసుకున్నారు. పిల్లలు మనిగర్‌సానే, నేహిత పైనాతో వారు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



కె.గంగవరం మండలం కుందూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్. పక్క చిత్రంలో మండపేటలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పింఛన్ల పంపిణీలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కె.గంగవరం, మే 31(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం కుందూరు గ్రామంలో ఆయన సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. పేదల అవసరాలు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ అజెండా అని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జగతా రమణ, మేడిశెట్టి బాబి, పళ్ల చినబాబు, సిర్రా సురేష్, కట్టా నాగేశ్వరరావు, మేడిశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

రాయవరం, (ఆంధ్రజ్యోతి): జూన్ 1న పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగా లబ్ధిదారులకు వాటిని అందజేశారు. జూన్ 1న ఆదివారం వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగా సచివాలయ సిబ్బంది ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఎంపీడీవో కీర్తి స్పందన ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచే పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మండలంలో 90.53 శాతం పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.

పింఛన్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ల సొమ్మును పెంచి లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత ప్రభుత్వానికే దక్కుతుందని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో శనివారం 20వ వార్డులో ఆయన పింఛన్‌లను పంపిణీ చేశారు. పింఛన్‌ల పంపిణీ సక్రమంగా జరుగుతున్నదా లేదా? అనే విషయాన్ని ఆయన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీర్రెడ్డి తదితరులు వున్నారు.



రాయవరం మండలం వెదురుపాకలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామివారు. పక్క చిత్రంలో ఆలయంలో పోటెత్తిన భక్తులు

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.57.36 లక్షలు

ఆత్రేయపురం, మే 31(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు జరిపి మొక్కులు చెల్లించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తజనం తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదంలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.57.36 లక్షలు వచ్చినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. నృత్యప్రియ డ్యాన్స్ అకాడమీకి చెందిన కూచిపూడి భరతనాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

బంగారు ఉంగరం అప్పగింత: గత వారం వాడపల్లి ఆలయంలో బంగారు ఉంగరం పోగొట్టుకున్న భక్తుడికి దాన్ని అందజేశారు. గాజువాకకు చెందిన సుదర్శనరెడ్డి మే 24న స్వామివారిని దర్శించుకుని వెళ్తుండగా సాయిబాబాతో ఉన్న ఉంగరం పడిపోయింది. ఒక భక్తుడికి అది దొరకగా ఆలయ సిబ్బందికి దాన్ని అందజేశారు. శనివారం ఆలయానికి వచ్చిన సుదర్శనరెడ్డికి దొరికిన ఉంగరాన్ని జూనియర్ అసిస్టెంట్ వై.శ్రీను అతని వివరాలు నమోదు చేసుకుని ఉంగరాన్ని అందించారు.



ఆత్రేయపురం మండలం కేశవస్వామి ఆలయంలో యోగా శిక్షణ అందిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో ఆలమూరులో యోగా తరగతుల్లో ఎంపీడీవో రాజు తదితరులు

యోగాతో ఆరోగ్యం పదిలం

ఆత్రేయపురం, మే 31(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా తరగతులు నిర్వహించారు. యోగా శిక్షకులు వెంకట్రాజు ఆలయ సిబ్బందికి యోగా శిక్షణ అందించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన యోగా తరగతులను ఎంపీడీవో వెంకటరామన్ తదితరులు పరిశీలించారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): యోగాలో ప్రతి ఒక్కరూ పాల్గొని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఎంపీడీవో ఎ.రాజు కోరారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన యోగా తరగతులలో పాల్గొని యోగా వేశారు. కార్యక్రమంలో ఎంఈవో బి.అప్పాజీ, ఎంపీడీవో కార్యాలయం ఏవో మోహర్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

రావులపాలెం, మే 31(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని హోటల్ కోనసీమ మీటింగ్ హాలులో భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ రాష్ట్ర కార్యదర్శి డి.ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 2న జిల్లాలోని అన్ని తహశీల్దారు కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. జూలై 19, 20, 21 తేదీల్లో అమలాపురంలో జిల్లా మహాసభ నిర్వహించేందుకు తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మండపేట, మే 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఒప్పంద కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి డిమాండ్ చేశారు. మండపేటలో కార్మికుల రిలే నిరాహార దీక్షలు శనివారం 8వ రోజుకు చేరాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్ష శిబిరాన్ని ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు కె.నరేంద్ర, బంగారు కొండ, రాజు, పెందుర్తి లోవరాజు, చిరంజీవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహారదీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన నరసింహారావు

సీఎంను కలిసిన కరుటూరి

ఆత్రేయపురం, మే 31(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గం చెయ్యేరులో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం టీడీపీ నాయకులు కలిశారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ జిల్లా కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు హెలిప్యాడ్ వద్ద చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన రోహిత్ ఇటీవల ముమ్మిడివరం మండలంలోని సలాదివారిపాలెంలో గోదావరిలో మునిగి మృత్యువాతపడిన సంగతి తెలిసిందే. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నేతలు ఎం.సూర్యప్రకాష్, టేకి వెంకటరమణ తదితరులు వున్నారు.

నిరసన పోస్టర్ విడుదల

ఆలమూరు, మే 31(ఆంధ్రజ్యోతి): జూన్ 4న తలపెట్టిన నిరసన పోస్టర్‌ను శనివారం చెముడులంకలో వైసీపీ నేతలు విడుదల చేశారు. అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి అధ్వర్యంలో విడుదల చేసి వెన్నుపోటు దినం నిరసన విజయవంతం చేయాలని వక్తలు కోరారు.